# మనసు నవ్విన వేళ మమత విరిగింది !

"భారతీ ! ఏం చేస్తున్నావే ? పెరట్లో ఆ పెద్దవెధవలిద్దరూ దెబ్బలాడుకుంటున్నారల్లేవుంది చూడు!"....

స్టౌముందు కూర్చుని, నీలిరంగు మంటవేపు చూస్తూ, గిన్నెలో ఉడుకుతున్న పప్పు మీది ఆవిరి మీద అరచెయ్యి పెట్టి, చేతికంటిన తడని పరీక్షగా చూచుకొంటున్న భారతి త్రుళ్ళిపడింది. పురిటిగదిలో నుంచి శారద గొంతు మళ్ళీ గర్జించింది. "భారతి ! ఎక్కడున్నావే ?"

"ఇక్కడే వున్నా ! నక్కయ్యా" అసహనంగా జవాబిచ్చింది భారతి.

"ఇంకా అక్కడే వున్నావూ ? పెరట్లో ఆవెధవలిద్దరూ బ్రతికి వున్నారో లేదో చూశావూ ?"

విసుగ్గా లేచివెళ్ళింది భారతి. ఆ సరికే శారద గొంతు విని పెరట్లోకి వెళ్ళిన కృష్ణమూర్తి, మగపిల్లలిద్దర్నీ, చెరో రెక్కా పుచ్చుక, ఇంట్లోకి లాక్కువస్తున్నాడు.

వంటగది గుమ్మం మెట్లు దిగుతూ, బావవేపుచూస్తూ ఆగిపోయింది భారతి. ఆమెవేపు చూసి తలదించుకున్నాడు కృష్ణమూర్తి.... లేత గులాబి రంగులోవున్న ఆమె పాదాలు చలికి, చిత్తడికి అక్కడక్కడా పగిలి వున్నాయి.

బావ వేపు చూస్తున్న భారతికి జాలివేసింది. 'ఎందుకీ మానవుడిలా కృంగి పోతున్నాడు! బహుశా నా మూలం గానే నేమో?'' అందామె హృదయం బాధగా!

"వంటయిందా భారతీ'' ఇబ్బందిగా వున్న ఆ పరిస్థితిని మారుస్తూ అన్నాడు కృష్ణమూర్తి.

"ఆ! అవుతోంది మరో పదినిముషాల్లో వడ్డించేస్తాను"

"భారతీ! నాక్కాసిని వేన్నీళ్ళు తీసుకురా! నాలిక పిడచకట్టుకు పోతోంది!" గదిలోనుంచి శారద గొంతు శివంగి గర్జనలా వినిపించింది.

భారతి లోలోపల నవ్వుకుంది. "ఆ! వస్తున్నా నక్కయ్యా!'' వెనుదిరిగింది భారతి.

"భగవాన్!'' అస్పష్టంగా నిట్టూర్చిన కృష్ణమూర్తి కంఠస్వరం, భారతి వెన్నుమీద ప్రాకింది క్షణకాలం.

"మీ బావ అన్నం తింటున్నారా?'' భారతివేపు నిప్పులు చెరిగే కళ్ళతో చూస్తూ అడిగింది శారద! తల చుట్టూరా కట్టుకుని వున్న 'తలకట్టు బట్ట' తీసి మంచంమీద విసిరేసింది. ఆరు రోజులుగా జుట్టు దువ్వుకోనందు వల్ల రేగి వున్న జుట్టు నుడులు చుట్టుకువుంది! అప్పుడే ఈనిన ఆడు పులి కళ్ళలోని ఆకలి తాలూకు జ్వాలేదో, శారద కళ్ళలో ప్రతిఫలిస్తున్నట్లు తోచింది భారతికి. "ఊహూ!" అంది, అక్క ప్రశ్నకు సమాధానంగా.

"మరేం చేస్తున్నారు వంట ఇంట్లో?"

Good work



ఆమె చేతిలోని ఖాళీ గ్లాసును విసురుగా లాక్కుంటూ అసహ్యంతో వుడికిపోయింది భారతి. అసహనంగా అరిచింది, ''నాతో సరసాలాడుతున్నారు!''

శారద మాట్లాడలేదు. ఆమె హృదయంలోని అగ్నిశిఖలా 'హూం'! అనే మూలుగు మాత్రం బయటికి వచ్చింది.

భోజనం చెయ్యకుండానే, డ్రెస్ చేసుక భార్య పడుకుని వున్న గది గుమ్మం దగ్గరకు వచ్చిన కృష్ణమూర్తి, శారద వేపు చూడకుండానే "నేను ఆఫీసుకు వెడ్తున్నాను. బహుశా ఈరోజు మధ్యాహ్నం కాంప్‌కు వెళ్ళవలసి వుంటుందేమో? అటునుంచటే వెడతాను...." అన్నాడు గుమ్మానికి చెబుతున్నట్లు

''ఇదేమిటి? భోజనం చెయ్యకుండానా?'' ఆదుర్దాగా అడిగింది శారద.

"ఊహుఁ! ఆకలిగా లేదు" జవాబుకు ఎదురు చూడకుండా వెళ్ళిపోతున్న అతగాడివేపు క్షణకాలంచూచి, వంట ఇంటి గుమ్మంలో కూర్చుంది భారతి.

"భగవంతుడా! చేజేతులా నరకం తయారు చేసుకున్నాను. అనవసరమైన జాలిచూపి నా కాపురం నట్టేట్లో ముంచుకున్నాను...."

శారద ఏడుపు అలలు అలలుగా వినిపిస్తోంది! శరీరమంతా జలదరించి నట్లయింది భారతికి. చివాలున లేచి, మేడమీద, తనకోసం కేటాయించబడివున్న గదిలోకివెళ్ళింది,

కిటికీలో కూర్చుని శూన్యంలోకి చూచింది. పక్కింటివారి కాంపౌండులో వరుసగా వున్న క్రోటన్స్, రంగు రంగుల ఆకులతో పకపక నవ్వుకుంటున్నాయి, ఎండకు అందంగా మెరుస్తూ.

బహుశా తనూ ఆ క్రోటన్ మొక్కలాంటిదేనేమో ? ఏపుగా పెరిగింది. అందంగా వుంది.... కానీ.... కానీ.... భారతి దృష్టి క్రోటన్స్ దాటి, ఎక్కడో దూర తీరాలకు పరుగులు తీసింది....

నవ్వుతూ, తుళ్ళుతూ, అందంగా, ఏపుగా క్రోటన్ మొక్కలా పెరిగిన భారతి ఎమ్ ఎస్.సి పాసై/పి. హెచ్.డి. తీసుకుంది. ఆరు సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తోంది! అప్పుడు గానీ ఆమెకు తనలో పెరుగుతున్న మరో భారతిని గురించిన ఆలోచన కలుగలేదు!

తనలోని భారతి తనని నిద్ర పోనివ్వటంలేదు. ఊపిరి సలుపుకో నివ్వటంలేదు.

'నాకో జతగాడు కావాలి, అతగాడి పాదాలముందు నా సర్వస్వాన్నీ అర్పించాలి. అతగాడి హృదయంలో నిశ్చింతగా నేను నిద్రపోవాలి. ఈ ఉద్యోగమూ, చదువూ నాకు సంస్కారాన్నీ, ఆర్థిక స్వాతంత్ర్యాన్నీ మాత్రమే ఇస్తోంది. కానీ.... కానీ నాకు కావలసింది మరేదో వుంది. అది చదువుల వల్లా, ఉద్యోగాలవల్లా లభ్యం కాదని నాకు తెలుసు! నా చుట్టూరా ఓ బలిష్టమైన బాహువలయం, ఆ వలయంలో

నన్ను నేను మరచిపోయేంత నిశ్చింత, ఆ నిశ్చింతలోనే నా జీవితం కమ్మని తావి వెదజల్లాలి!'

భారతి నిర్ఘాంతపోయింది. తన మనసులో తనకు తెలియకుండానే ఇంతటి బలీయమైన కోర్కె ఓ ఆకృతిదాల్చి, పీఠం వేసుకూర్చుందేమిటి? అందు కనుగుణంగా తన కళ్ళూ హృదయమూ ఆ జతగానికోసం ఆత్రంగా వెదకుతున్నాయని కూడా తెలిసిపోయింది.

అమ్మా, నాన్నలకు ఐదవ ఆడపిల్ల తను! నలుగు రక్కయ్యలకు పెళ్ళిళ్ళు చేసినవాళ్ళకు, భారతి పెళ్ళి గురించి ఆలోచించటానికే భయం పట్టుకుంది. పాపంలా పెరిగివున్న అప్పూ, హరించుకుపోయిన ఆస్తీ, అవినీతిలా పెరిగిపోయిన కట్నాలూ....భారతి పెళ్ళి ప్రయత్నాలు చెయ్యనివ్వలేదు వారిని! చదువులో మెరిట్ స్కాలర్‌షిప్ సంపాదించుకుంది భారతి!

అందుకే భారతిని కాలేజీలో చేర్పించారు! ఎం ఎస్ సి అక్కడ లేకుంటే, పరాయిచోటుకు పంపటానికి కూడా వెను దియ్యలేదు.

డిగ్రీపుచ్చుక చెక్కు చెదరకుండా ఇంటికి వచ్చిన కూతుర్ని పరీక్షగా చూచి బుగ్గలు నొక్కుంది తల్లి....! ఎందుకో అర్థం కాలేదు, అప్పట్లో భారతికి!

ఐదు సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్న కూతురులో మార్పు రాకపోవటం చూచి. మరింతగా కలవర పడింది తల్లి!

'కాలేజీల్లో చేర్చి. చేర్చకముందే ప్రేమలోపడి, అన్ని హంగలూ వున్నవాణ్ణి తమంత తాముగా కుదుర్చుక, కానీ కట్నం లేకుండా పెళ్ళాడే ఏర్పాటు చేసుకుంటున్నారు కొంద రాడపిల్లలు .... మన పిల్లా వుంది ! ఎందుకూ ? గొర్రెలా తలవంచుక, డిగ్రీ పుచ్చుక, చేతులు ఝాడించుకుంటూ ఇంటికి వచ్చింది, ఎలా పెళ్ళౌందలా!'

ఒక రాత్రివేళ హఠాత్తుగా మెలుకువ వచ్చిన భారతి, తన ప్రక్క మంచంమీద పడుకుని వున్న తల్లి, నాన్నగారితో మెల్లిగా అంటున్న మాటలువిని, నిద్రమత్తు వదిలి నిర్ఘాంత పోయింది !

అమ్మేనా ఇలా అనటం ?

పెద్ద మనిషి అయిన అక్కయ్య, పెరట్లో జాజిపూలు కోసుకుంటూంటే. ప్రక్క మేడమీది అబ్బాయి కళ్ళప్పగించి చూస్తున్నాడని గమనించి, అక్కయ్యను నానా తిట్లూతిట్టి, మరెప్పుడూ ఒంటరిగా పెరటిలోకి కూడా వెళ్ళనివ్వని అమ్మేనా ఈమె ?

చిన్నక్కయ్య స్కూల్ ఫైనల్ పాసై. పెళ్ళి కాకుండా ఆరునెలలు ఇంటిలో వుందని, కంటిమీద కునుకు లేకుండా ఆరాటపడిన ఆ అమ్మేనా ఇలా అంటోంది ?

చిన్నఅక్కయ్య లిద్దరికోసం పొలమూ, ఇల్లూ తాకట్టు పెట్టమని, నాన్నగారిని శతపోరి, పెళ్ళిళ్ళు చేయించి 'పరువుగా బయటపడ్డాం!' అని తృప్తిగా నిట్టూర్చిన అమ్మేనా ఈమె ?

కాలంలో మార్పా ? అమ్మలో మార్పా ?

చివరకు వేశ్యమాతలా .... తన కూతురు, ఎవరో అందగాణ్ణి ఆపళంగా వరించి తీసుకవచ్చి, తమ బాధ్యతను తీర్చుకున్నామన్న సంతృప్తిని కలిగించలేక పోయిందని, బాధ పడ్తోందా ?

నాన్నగారునవ్వుతున్నారు. 'ఇప్పుడేం మించిపోయింది? అది పనిచేసే ఆఫీసులో చాలామంది బ్రహ్మచారి యువకులు న్నారు....మరో ఏడాది పోనీ చుద్దాం!'

నరాలు బిగుసుకు పోయినట్లయినాయి భారతికి ! ఎంత జారిపోయారు ?

అన్న వస్త్రాల కరువుతోబాటు, నీతి నియమాల కరువుతో బాటు, కన్న తల్లి దండ్రులలో కూడా ఇంతటి వికృత మైన మనస్థితి విజృంభిస్తోందా ? తెల్లవారు ఝామువరకూ నిద్ర పట్టలేదు భారతికి !

మరునాడు ఆఫీసులో అడుగెట్టిన భారతికి, తాను తన అందంతో, చలాకీ తనంతో మగవారిని ఆకర్షించ బోతుందా ? అన్న భావం తొలిసారిగా తలెత్తి, ఆమెను తలెత్తుకో లేకుండా చేసింది !

రెండు నెలలు తిరక్కముందే, సుదర్శన్ తన దగ్గరగా వచ్చి 'మేడమ్! మరోలా అనుకోకపోతే మీతో కాస్సేపు మాట్లాడటానికి వీలు కల్పిస్తారా ?' అని అర్థించినపుడు ఆశ్చర్యపడింది భారతి.

సుదర్శన్ అందంగా వుంటాడు. గులాబి రంగులో నిగ నిగలాడే అతగాడి చెక్కిళ్ళలో పసిపిల్లల అమాయకత్వం ప్రతిఫలిస్తుంటుంది. ఆఫీసులోని మిగతా ఉద్యోగులలా ఆడవారివేపు తృష్ణతో నిండిన చూపులు ప్రసరింప చేయడు! తన పనేమిటో, తానేమిటో నన్నట్లుగా వుంటాడు. స్త్రీలకు అతిగౌరవం ఇస్తాడు....

'అలాగే' అంది భారతి మెల్లగా.

సుదర్శన్ కళ్ళలో ఆనందం తొణికిసలాడింది. 'సాయంత్రం ఆఫీసు వదిలాక పార్కుకు వెడదామా'!

'అలాగే!'

సాయంత్రం పార్కులో కూర్చున్నారిద్దరూ.

'మీరంటే నాకు ప్రత్యేకమైన గౌరవభావం వుంది!' మెల్లగా అన్నాడు సుదర్శన్.

'ఎంచేత?' అతగాడివేపు పరీక్షగా చూస్తూ అడిగింది భారతి.

కాస్సేపు మాటలకోసం తడుము కున్నట్లు చూశాడు సుదర్శన్. తర్వాత మెల్లగా అన్నాడు. 'బహుశా .... మీలో .... మగాళ్ళని ఆకర్షించుకోవాలనే మానసిక రుగ్మత లేదు....అంచేత!'

భారతి ఆశ్చర్యంగా అతగాడి వేపు చూచింది.

'అవును, సుమారు రెండేళ్ళుగా నేనూ మీతో బాటు అదే ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాను. మీప్రవర్తన గమని

స్తూనే వున్నాను .... మిగతా కొందరు స్త్రీ ఉద్యోగినలూ వున్నారుగా మన ఆఫీసులో? వారి ప్రవర్తనకూ, సంస్కారానికి, మీకూ పోలికే లేదు! మగాళ్ళను తమచుట్టూ భ్రమరాల్లా తిప్పుకోవాలన్న కాంక్ష వారి కళ్ళల్లో ప్రతిఫలిస్తుంటుంది అనుక్షణం! తమ అందాన్ని ఎక్స్పోజ్ చేసుకుంటూ, అది వలగా విసరాలనే నైచ్యం కనిపిస్తోంది వారి అలంకరణలో....అందుకే నాకు వాళ్ళంటే తగని భయం.... అసహ్యం....

కానీ మీరలా కాదు .... ఏ క్షణంలోనూ మీ ఉనికిని గురించి పదుగురికీ తెలియాలనే వెకిలితనం మీలో లేదు.

భారతి మాట్లాడలేదు. సుదర్శన్‌లో ఇంతటి ఆలోచనాశక్తి వుందనీ, అతగాడు తననింతగా స్టడీ చేస్తున్నాడనీ ఏనాడూ ఊహించలేదు.

'....మీరు అంగీకరిస్తే, మిమ్మల్ని నా జీవిత భాగస్వామినిగా చేసుకుంటాను....అంతటి అదృష్టం నాకు కలిగించమని కోరుతున్నాను.'

స్నేహ పూర్వకంగా అర్థించాడు సుదర్శన్.

క్షణకాలం భారతి నిర్విణ్ణురాలయింది. సుదర్శన్ కోరిన కోరికలో అసమంజసమేమీ లేదు. కానీ తనకూ, సుదర్శన్‌కూ ఈడూ జోడూ ఎలా కుదురుతుంది? ఇరవైఎనిమిది సంవత్సరాలు నిండిపోబోతున్న తనకూ, ఇరవైమూడేళ్ళు కూడా నిండని సుదర్శన్‌కూ వివాహమా? '....మీరు నా

గురించి చాలా తెలుసుకున్నారు.' చిరునవ్వుతో అంది భారతి. 'కానీ తెలుసుకోలేక పోయింది మరొకటుంది'.

'ఏమిటి ?' ఆత్రంగా అడిగాడు సుదర్శన్.

'నా వయసు....'

'ఒద్దు.... ఒద్దు.... చెప్పొద్దు. స్త్రీ తన వయసూ, పురుషుడు తన జీతమూ దాచితేనే అందం' గబుక్కున అన్నాడు సుదర్శన్.

'అక్కడే పొరబడుతున్నారు మీరు కరిగిపోతున్న వయసును దాచుకోవాలనే ఆరాటం స్త్రీ లోనూ, ఆర్థిక సూత్రాలతో ముడిపడివున్న జీవననౌక సాఫీగా సాగాలంటే, తన సంపాదన వివరాలు, తన జీవిత భాగస్వామికి తెలిసి తీరాలన్న వివేకంలేని దాపరికం పురుషునిలోనూ, వున్నంత కాలం ప్రగతి సాధ్యం కాదు'

'ఏమోఁ అర్థంగాని దేమిటో చెబుతున్నారు మీరు.'

"....ఇందులో అర్థంకాని దేముందీ ? నా వయసు ఇరవై తొమ్మిది సంవత్సరాలు! మీ వయసు బహుశా ఇరవై మూడో, నాలుగో అయ్యిండొచ్చు'

షాక్ తిన్నట్లు చూశాడు సుదర్శన్.

'....భార్యకంటే భర్త కనీసం మూడు సంవత్సరాలైనా పెద్దవాడుగా వుండటం, మన కుటుంబాలలో సాంప్రదాయం. కానీ మీకంటే నేనే ఐదారు సంవత్సరాలు పెద్ద

దాన్ని—అనే భావం వున్నంతకాలం, నేను మిమ్మల్ని భర్తగా స్వీకరించటం ఎలా సాధ్యం?'

సుదర్శన్ మాట్లాడ లేదు.

'....దయచేసి మరోలా అనుకోకండి. మనిద్దరిమధ్యా స్నేహం అభివృద్ధి కావడాన్ని నేనూ అంగీకరిస్తాను కానీ.... వయసులో పెద్దదాన్నై... మిమ్మల్ని....'

చాలా సేపటివరకూ సుదర్శన్ మౌనంగా వుండి పోయాడు. తర్వాత మెల్లగా లేస్తూ అన్నాడు. 'థాంక్స్! ఇందాకా మిమ్మల్ని ఓ మంచి 'స్త్రీ' గా మాత్రమే గౌర విస్తుండేవాణ్ణి! కానీ ఈ క్షణంనుంచీ, మీ నిర్మలమైన వ్యక్తిత్వానికి జోహార్లర్పిస్తున్నాను. ఆజన్మాంతం మీరు నా స్నేహితురాలిగా, అత్యంతాత్మీయురాలిగా వుండిపోవాలని కాంక్షిస్తున్నాను. ఆ కోర్కె అయినా తీర్చగలరను కుంటాను!

భారతి మృదువుగా నవ్వింది. 'తప్పకుండా!'

ఆ రాత్రంతా భారతి తీవ్రంగా ఆలోచించింది! తను పిచ్చిపని చేసిందా? తన వయసు దాచి, అతగాణ్ణి చేపట్టి వుంటే సరిపోయేదా?

ఊహూఁ! తమ్ముడిలా వున్న సుదర్శన్....అక్కలా తనూ .... భార్యా భర్తలుగా ఎలా వూహించుకోగలదు తను?

భర్త అన్న తర్వాత, తనకంటే వయస్సులోనూ, వివేకంలోనూ, శారీరకమైన ధృఢత్వంలోనూ, కొంత పెద్దవాడుగా వుండాలి....

సుదర్శన్ తనను ఆరాధించగలడు....గౌరవించగలడు, కానీ భార్యగా, గృహిణిగా శాసించలేడు.

తనక్కావలసిం దదికాదు .... గౌరవించాలి, ప్రేమించాలి, శాశించాలి అందుకు వయసులో తను చిన్నదిగా వున్నపుడే సాధ్యం !

రెండు నెలలు గిర్రున తిరిగాయి. ఆఫీసులో సుదర్శన్ మామూలుగానే ప్రవర్తిస్తున్నాడు ఏమీ జరగనట్లు. కానీ అనుకోని మార్పులు భారతి చుట్టూరావున్న పరిస్థితుల్లో ఏర్పడ్డాయి.

అప్పులకు ఆస్థంతా పోగా, అమ్మ, నాన్నగారు, అక్కయ్యల దగ్గర వంతులవారీగా వుండటానికి నిశ్చయించుకున్నారు !

ఆఫీసులో తనతోబాటు వర్క్ చేస్తున్న స్త్రీలలో చాలామంది ప్రేమ వివాహాలలో కృతకృత్యులయ్యారు

ఏ ఆదివారమో, బొత్తిగా తోచక, ఏ స్నేహితురాలింటికేనా వెడితే చాలు, ఇక ఆ స్నేహితురాలి ప్రవర్తనలో మార్పు స్పష్టంగా తెలుస్తోంది భారతికి !

రూములో వున్న భర్తను దాచేస్తుంది....! తనమీద అతగాడిచూపులు ఎక్కడ ప్రసరిస్తాయోనని హడలిపోతుంది !

ఏదో భయంకరమైన వన్యమృగం బోనులోనుంచి తప్పించుకుని సరాసరి తన ఇంటిలోకి దూరినట్లు కంగారు పడిపోతుంది.

'త్వరగా పెళ్ళి చేసుకో భారతీ ! అంటూ ఐదు నిమిషాలకు రెండుమార్లు చెప్పిన వార్నింగ్ ఇస్తుంది....!

ప్రతి స్నేహితురాలూ ఇదే తంతు !

ఏ చేత వాళ్ళు తనంటే అలా హడలి ఛస్తున్నారు ? వివాహం కాకముందు తామంతా, మగవారికోసం, వారిని ఆకర్షించు కోవటంకోసం, ఎగబడినట్లు. తనూ వేషాలు వేస్తుందని భయమా ? ఆలోచనలతోనే రోజులు దొర్లి పోతున్నాయి.

◆ ◆ ◆ ◆

ఏదో సంబంధం చూస్తున్నామనీ వెంటనే బయల్దేరి రావలసిందనీ, పెద్ద అక్కయ్య శారద ఉత్తరం వ్రాసింది ! ఆ ఉత్తరంలోనే తనకు పురిటి రోజులు వస్తున్నాయనీ, ఓ రెండు నెలలు ఉద్యోగానికి శలవుపెట్టి వస్తే, చాలా మేలు చేసినట్లవుతుందనీ, ఆ మేలు జన్మ జన్మలకూ మరచిపోలేనని కూడా వ్రాసిందావిడ

భారతికి కూడా కొంతకాలంపాటు అలా వెళ్దామనే అనిపించింది మానసికంగా ఏదో అశాంతి అనుభవిస్తున్న ఆమెకు కొంత విముక్తిలభించినట్లనిపించింది.

రెండు నెలలు జీతం తగ్గింపుమీద శలవుపెట్టి వెళ్ళింది. శారద, ఆవిడ ముగ్గురు పిల్లలూ. కృష్ణమూర్తి బావల

మధ్య భారతికి రోజులు క్షణాలుగా గడిచి పోతున్నాయి. చూచిన సంబంధం తుస్సున ఎగిరిపోయింది అతగాడు ఇంజనీరుట పదిహేనువేలు కట్నం, స్కూటరూ! రేడియో ఫర్నిచర్ లాటి చిన్నచిన్న లాంఛనాలూ మాత్రం చాలన్నాడు ! చదువుకుని ఉద్యోగాలు చేసే ఆడపిల్లల మీద తనకాట్టే నమ్మకంలేదనీ, వివాహమైన మరుక్షణంనుంచి తనకాబోయే భార్య ఉద్యోగానికి స్వస్తి చెప్పడమే కాకుండా, బయటి ప్రపంచంతో ఎలాటి సంబంధం లేకుండా, కేవలం 'ఫలానా ఇంజనీరుగారి శ్రీమతి' గా మాత్రమే వుండాలని సూచించాడు.

భారతి లోలోపల నవ్వుకుంది! మొదటిసారిగా సుదర్శన్ వ్యక్తిత్వం ఓ ఆకృతిదాల్చి ఆమెహృదయంలో ఓక్రొత్త భావ సంచలనాన్ని రేపింది.

◆ ◆ ◆ ◆

నెల తిరిగేసరికే భారతికి క్రొత్త సమస్య ఎదురైంది! శారదలో ఏదో మార్పు వచ్చింది. అస్తమానూ తనని చూచి చిరాకు పడటమూ, కృష్ణమూర్తితో వాదులాడటమూ, ఇద్దరినీ కలిపి ఏదో వ్యంగ్యాలు విసరటమూ చేస్తోంది! మొదట్లో శారద ప్రవర్తనకు అర్థం ఫలానా అని స్పష్టంగా బోధపడలేదు భారతికి. తర్వాత, అర్థమయ్యాక నిర్విణ్ణురాలైంది.

తనకూ. శారదకూ మధ్య పన్నెండు సంవత్సరాలు తేడా వుంది ! తనకూ కృష్ణమూర్తిబావకూ మధ్యమమారు! పదిహేను సంవత్సరాలు తేడావుంది !

ఎలా వూహిస్తోంది శారద ? అంత జుగుప్సాకరంగా ఆలోచించటానికి ఆధారం ఏమిటి ? బావ ఏనాడూ తనను మరోదృష్టితో చూడటం లేదే ?

తనే క్షణంలోనూ హద్దు మీరటంలేదే ? మరి కారణం ?

బహుశా ఒకటే ! తను అవివాహిత !

రోజు రోజుకూ దుర్భరమై పోతోంది వాతావరణం ! మేడమీద గదిలో తనూ, పిల్లలూ పడుకుంటారు ! క్రింద హాలులో బావ, అక్కయ్య పడుకుంటారు !

అయినా శారదక్కయ్యకు కంటిమీద కునుకులేదు ! మనసుకు శాంతిలేదు ! ఆ అశాంతితో ఆమెలో రేగిన అగ్ని జ్వాల అటు బావనూ, ఇటు తననీ కూడా కాల్చివేస్తోంది అనుక్షణం.

ఈలోగా పురుడు వచ్చింది శారదకు? మరింత జుగుప్సాకరంగా తయారైంది వాతావరణం !

♦ ♦ ♦ ♦

"పిన్నీ!"

త్రుళ్ళిపడి వెనుదిరిగి చూచింది భారతి. క్రోటన్స్‌ను దాటి వెళ్ళిన చూపుల్ని, ఆలోచనల్ని వెనక్కు లాక్కుంది.

'శారద పెద్ద కొడుకు గుమ్మంలో నిల్చుని వున్నాడు. 'అమ్మకు ఆకలేస్తోందట. రొట్టె కాల్చిపెట్టమంటోంది!''

''పద వస్తున్నా!''

వాడు వెళ్ళిపోయాడు. ఇంకా ఇరవై రోజులుంది శలవు. కానీ తనిక్కడ వుండలేదు! ఇక ఎక్కడా వుండలేదు వంటరిగా.

సుదర్శన్....

అవును. ఆనాడు సుదర్శన్ కోరాడు. పిచ్చిగా వయసును గురించి ఆలోచించింది తను.

పదిహేను సంవత్సరాలు తేడా వుండగల బావనూ, తననీ అనుమానిస్తోంది శారదక్కయ్య! అందరూ తనను వెలి వేసినట్లు భయంగా దూరంగా నెట్టి వేస్తున్నారు.

సుదర్శన్ తనను మనసారా కోరాడు: ఆరాధిస్తున్నాడు. ఏం అతగాడు తనకంటే కొద్ది సంవత్సరాలు చిన్నవాడైతే మాత్రం ఏం ముంచుకు పోతుందీ?

అవును. ఆనాడే తన అంగీకారాన్ని తెలిపి వుండవలసింది. ఈనాడైతే మాత్రమేం? సుదర్శన్‌కు తన అభిప్రాయం మార్చుకున్నట్లు చెప్పగల చనువు వాళ్ళిద్దరిమధ్యా వుంది. అంతే ఇదే నిర్ణయం. భారతి చక చక మేడదిగవచ్చింది. ఆమె మనసు హాయిగా నవ్వింది. మమత పురులు విప్పుకొంది.

రొట్టె కాల్చి, ప్లేటులో పెట్టి శారద రూంలోకి తెచ్చి, ముభావంగా ఆవిడ చేతికిచ్చింది.

తను రేపు ఉదయానికి వస్తున్నట్లూ, స్టేషన్‌కు రావలసిందిగా కోరుతూ సుదర్శన్‌కు టెలిగ్రాం వ్రాసి, శారద కొడుకు చేత పోస్టాఫీసుకు పంపింది.

హుషారుగా వంటపని ముగించింది. చక చక బట్టలు సర్దుకొంది సూట్‌కేసులో !

చెల్లెలి హడావుడి ఏమిటో అర్థంగాని శారద ఆశ్చర్యంగా గమనిస్తూ కూర్చుండి పోయింది....

సాయంత్రం ఆరు గంటలు కావొస్తుండగా ముస్తాబై అక్క గదిదగ్గర కొచ్చింది భారతి. 'అక్కయ్యా! మరో అరగంటలో ట్రెయినుంది, నే వెళతాను ఇక అవివాహితగా నీ యింటికి రాను. నీ జీవితంలో అశాంతి రేపుతాననే భయం ఇక నీకు కలుగనివ్వను."

'భారతీ!' ఆదుర్దాగా అంది శారద. 'ఏమిటే నువ్వంటున్నదీ? న్నిప్పుడేమన్నాను నేనూ? నాకు స్నానమైనా చేయించకుండా వెడతావా?"

భారతి నవ్వింది 'ప్రతిసారీ పురుళ్ళూ, పురిటి స్నానాలూ నేనే చేయిస్తున్నానా నీకు? మరొక్కమాట అక్కయ్యా! బావకూ నాకూ మధ్యవున్న వయసు తేడాలు నువ్వు మర్చిపోయావేమో గానీ, నాకుమాత్రం గుర్తుంది. మరినాకు టైమయి పోతుంది వెళుతున్నాను మరి రాను.

నిర్ఘాంతపోయిన శారద, కోలుకొని ఏదో చెప్పబోయేంతలోనే, భారతి రిక్షాలో కూర్చుంది.

ట్రెయిన్‌లో తెల్లవార్లూనిద్రపో లేదు. నిద్ర రాలేదు.

'ఈరోజు మీ వయస్సు ఆరేళ్ళు తగ్గిందాండీ?' అని సుదర్శన్ అంటే?-ఊహూ, అలా అన డతగాడు. అంటే

తను చెబుతుంది. 'అవును మీకు అర్ధాంగి కావడంకోసం మనసు ఐదారేళ్ళ వయసును మ్రింగేసింది!' అని. సుదర్శన్ అందంగా నవ్వుతాడు, నవ్వి తనని....

భారతి మనసు అలాటి దృశ్యాలను వూహించుకుంటూ మనసారా నవ్వుకొంటూనే వుంది.

"భారతీ! వచ్చావా ?' ఆత్రంగా తనకోసమే, ఎదురు చూస్తున్న సుదర్శన్ చేతులలో అలాగే వాలిపోదా మని పించిన కోర్కెను, చుట్టూరా ఫ్లాట్‌ఫారమ్ నిండా వున్న జనాన్ని చూచి నిగ్రహించుకుంది భారతి. ఈ ఒకటిన్నర నెలలోనూ అతగాడు, తన కంటే చాలా పెద్ద వాడిలా మారినట్లనిపించిం దామె హృదయానికి.

'టాక్సీ మాట్లాడారా ?' అంది మెల్లగా.

'అవసరం లేదు. కారుంది."

'కారా ? కొన్నారా? "ఆశ్చర్యంగా అడిగింది. ఇంత త్వరలో అతగాడు కారు కొనేంతటి వాడయ్యాడా ?

"ఈ జనాన్ని తప్పించుకువెళ్ళి .... అన్నీ వివరంగా మాట్లాడుకుందాం!' స్టేషన్ బయటికి దారితీస్తూ అన్నాడు.

లేత ఆకుపచ్చ రంగులో, ఉదయపు ఎండలో తళతళ మెరుస్తోంది కొత్త కారు !

'రండి' వెనక డోర్ తెరచి పట్టుకున్నాడు .... కూర్చుంది. డ్రైవర్ స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. సుద

ర్శన్‌కూడా వెనక సీట్లోనే కూర్చున్నాడు. కారు వెడుతోంది మెత్తగా, భారతి మనసు నవ్వుతోంది మృదువుగా....

—"సరిగ్గా నిన్న సాయంత్రమే అనుకున్నాను, రాధికకు ముందస్తుగా మిమ్మల్ని పరిచయం చెయ్యాలని మీ వ్యక్తిత్వపు ఔన్నత్యాన్ని గురించి సగర్వంగా చెప్పుకోవాలని...." ఆమె వేపు స్నేహపూర్వకంగా చూస్తూ అన్నాడు సుదర్శన్.

"రాధిక ఎవరు ?" విస్మయంగా అడిగింది.

"ఇందాక అడిగారు .... కారు కొన్నారా ? అని గుర్తుందా ? ఈ కారు ఆవిడది...."

'.... .... ....'

"నాకు బహుమతిగా ఇచ్చారు రాధిక నాన్నగారు.... కానీ ఈ కారుకంటే విలువైనది.... అతి విలువగలది నాకు మరొకటుందని చెప్పాను రాధికతో ....'' సుదర్శన్ నవ్వుతూ అన్నాడు, భారతి వేపు చూస్తూ.

సరిగా బోధపడకున్నా, చిరునవ్వు నవ్వింది.

"ఏమిటది ? అని అడిగారు కాదేం? నేనే చెబుతాను, మీ స్నేహం!''

భారతి మౌనంగా చూచింది.

''నాకు కాబోయే అర్ధాంగిని ముందస్తుగా మీకు పరిచయం చెయ్యాలనిపించిందెందుకో! ఆ భావం తీవ్రం అయింది నిన్న సాయంత్రం ఆశ్చర్యం ! మీరు వస్తున్నట్లు నన్ను

స్టేషన్‌కు రమ్మంటూ వైర్ వచ్చింది మీదగ్గర్నుంచి. రాధికకు చెప్పాను. ఆ వైర్ తీసుక వేళ్ళి చూపి.... ఎంతగా సంతోషించిందనుకున్నారూ ?”

భారతి మనసు గిల గిల లాడింది, విక విక వెర్రినవ్వు నవ్వింది మరుక్షణం. మనసునిండా పరుచుకునివున్న మమత విరిగి, దుఃఖం సెగలు పొగలుగా ఎగసింది.

...“తనూ వస్తానంది. నేనే వద్దన్నాను. నాకు రాధికకూ మూడేళ్ళు తేడావుంది. ఎంతైనా, మీరు ఆనాడు చెప్పినట్లు మనకు సాంప్రదాయకమైన కట్టుబాట్లు కొన్ని వుండితీరాలి. ఫర్వాలేదుగదూ?” సుదర్శన్ నవ్వుతూ అడిగిన ప్రశ్నకు, భారతి తల వూగించింది, శూన్యంగా రోడ్డుమీదకు చూస్తూ, ఎండలో తళతళ మెరుస్తున్న తారురోడ్డు ఆమె విరిగిన మమతలా, వెనక్కు పరుగెడుతోంది ముక్కలుగా !

(“వాణిశ్రీ” మే 1968)

—o—